# ఆదో రకం ముచ్చట

"చిత్రంగా ఉందే...ఒక్క నిముషం ఉండండి. కోటు జేబులో ఉందేమో చూస్తాను" అన్నాడు అప్పారావు తొట్రుపడుతూ.

"అబ్బే తొందరేం లేదు. తాపీగా చూడండి" అన్నాడు టిక్కెట్టు కలెక్టరు—ఖాళీగా ఉన్న మూడవ తరగతి పెట్టెలో కాళ్లు బారజాచి కూర్చుంటూ.

అప్పారావు కోటు తడవడం మానేసి కిందనున్న పెట్టెను కొంచెం పక్కకి లాగాడు.

"ఏమండీ మీరు అహో రాత్రాలు రైళ్ళలోనే తిరుగుతూ ఉంటారు. టిక్కెట్టు కొనుక్కుని కూడా రైల్లో బల్ల అడుగున దూరి ప్రయాణం చేసిన ఆసామీ కథ విన్నారా?" అన్నాడు.

"ఎవరండీ. గుర్తు లేదే" అన్నాడు టిక్కెట్టు కలెక్టరు సిగరెట్టు ముట్టిస్తూ.

"మహోత్కృష్టమైన కథలెండి. ఈ లైనులోనే జరిగింది. తెనాలి బెజవాడ స్టేషన్ల మధ్య ఓ సుబ్బారావూ ఇంకో సింగారం తెనాలినించి బెజవాడ బయలుదేరారు. సుబ్బారావు టిక్కెట్లుకొని, హడావుడిగా ముందు నడుస్తూ ఇదిగో టిక్కెట్లు మీదగ్గిరుంచండి అని సింగారానికి అందిచ్చాడు. గోచీ సర్దుకుంటూ ఆదరా బాదరా వెనకాల వస్తున్న సింగారం అందుకుని జేబులో పడేసుకున్నాడు" అని ఆగి, కోటు జేబులో వెతకడం మొదలు పెట్టాడు. "చిత్రంగా ఉందే ఇక్కడా లేదు సుమండీ" అని ఆశ్చర్యం వెలిబుచ్చాడు.

"సరే కథ చెప్పండి."

"కథకేముంది. సుబ్బారావు అందిచ్చినవి రెండు టిక్కెట్లయితే సింగారం అందుకున్నది ఒక్క టిక్కట్టే. రైలు బైల్దేరాక వాళ్ళీ సంగతి తెలుసుకున్నారు. 'రెండూ నీకే ఇచ్చా'నంటాడు సుబ్బారావు. కాదొక్కటేనంటాడు సింగారం. ఇంకోటి కొనడానికి ఇద్దరి దగ్గిరా కూడా డబ్బులేదు. "నేనిచ్చిన డబ్బుకి నాకు టిక్కెట్టిచ్చావు. ఆపైన నాకేం తెలీదు" అంటూ అనేశాడు సింగారం. "అయితే నన్ను బల్లకింద దూరమంటావా" అన్నాడు సుబ్బారావు బిక్కమొహం పెట్టి. నాకేం అభ్యంతరం లేదు అన్నాడు సింగారం. అతను మాత్రం ఏం చేస్తాడు చెప్పండి టిక్కెట్టు కలెక్టరు గారూ!" అన్నాడు అప్పారావు.

"మరే మరే. అంతే కదండి. తనకి మాలిన ధర్మం ఏముంది?" అన్నాడు టికెట్ కలెక్టరు.

"సరే సింగారం బల్లమీద కూర్చున్నాడు. టిక్కట్టులేని సుబ్బారావు బల్లకిందదూరాడు. అంతలోకే పక్క పెట్లోంచి మీ వంటి ఆయనే ఒక టిక్కెట్ కలెక్టరు వచ్చాడు. చాలా మంచివాడు లెండి. అయినా ఈ సంగతి బల్లక్రింద పడుకున్న సుబ్బారావుకి తెలీదుగా. అసలే బల్లక్రింద నారింజ తొక్కలు, పిప్పి, చుట్ట పీకెలు బీడీ ముక్కలూ, పులిహోరలో మిరపకాయలు ఎంగిలాకులు వల్ల కొడు వశెనపరం మొదలైనవి మోకాల్లోతున ఉన్నాయేమో సుబ్బారావు ఊపిరి సలపక ఉక్కిరి బిక్కిరై పోతున్నాడు."

"పాపం"

"అంతలో 'టికెట్ టికెట్' అనే భయంకరమైన మాటలు వినిపించాయి టకటకమంటూ బూటు కాళ్లు కనిపించాయి. సుబ్బారావు గుండె గుభేలుమంది..." అప్పారావు ఆగి, పరితుష్టిగా చూశాడు.

టికెట్ కలెక్టరు కళ్లు రెపరెపలాడించి మందహాసం చేశాడు.

"సరే టిక్కెట్ కలెక్టరువచ్చి సింగారాన్ని టిక్కెట్ అడిగాడు. సింగారం బల్లకింద సుబ్బారావుని తలుచుకొని కొంచెం కంగారుపడుతూ టికెట్ అందిచ్చాడు... అప్పుడేమయింది తెలుసాండి?"

"తెలీదండీ"

"ఆ కంగారులో సింగారం అందివ్వబోయిన టిక్కెట్టు చేతిలోంచి జారిపోయింది...... సింగారం వంగిచూస్తే కనబడలేదు. లేచి నుంచుని పంచె కుచ్చెళ్లు దులిపాడు" అన్నాడు అప్పారావు.

"అప్పుడేమయింది?"

"ఏమవుతుంది. సింగారం టిక్కెట్టుతోపాటు ఇంకో టిక్కెట్టుకూడా కిందపడింది. ఆ రెండోది కూడా మంచిదే. తెనాలిలో సుబ్బారావు అందిచ్చిన రెండు టిక్కట్లలో అది రెండవదన్నమాట. జారిపడి సింగారం పంచె కుచ్చెళ్లలో పాదాలమీద ఉన్న మడతలో తలదాచుకుంది"

"చిత్రంగా ఉందే" అన్నాడు టిక్కెట్ కలెక్టర్.

"ఆవేళ రైల్లో ఎక్కిన టిక్కెట్ కలెక్టరు కూడా అదేమాట అన్నాడండి రెండు టిక్కెట్లు చూసి రెండో ఆయన ఏడీ?" అడిగాడు... "బల్ల కింద పడుకున్నాడండి. అదో సరదా అదో రకం ముచ్చటా లెండి అన్నాడు సింగారం సిగ్గుపడుతూ ఏంచి.

కథ విన్న టికెట్ కలెక్టరు, కడుపుబ్బేలా, కణతలు ఎర్రపడేలా కంటనీరు తిరిగేవరకూ నవ్వాడు. నవ్వడం పూర్తి అయిపోయాక "సరే మీ టిక్కెట్ దొరికిందా" అని అడిగాడు గంభీరంగా.

అప్పారావు టికెట్ దొరకలేదు. ముచ్చెమటలు పోశాయి. జేబు రుమాలుతీసి మొహం తుడుచుకోబోయాడు అందులోంచి, ఒక టిక్కెట్టు నేలగాలింది. అదుగో అన్నాడు అప్పారావు వంగి. ఆ వంగినవాడు అరనిముషం వరకూ లేవలేదు. అరనిముషం తరవాత నిటారుగా నిలబడి రెండు టిక్కెట్లు చూపించాడు. టిక్కెట్ కలెక్టరు కళ్లు విప్పార్చి చూశాడు అప్పారావు వంక.

రెండోది నా పంచె కుచ్చెళ్లలో ఉందండి...మా నేస్తం..."

బల్లకింద పడుకున్న ఆ నేస్తం కింద పడున్న సిగరెట్ పీకెతో చురక పెట్టాడు అప్పారావు కాలిమండ దగ్గిర. అప్పారావు కెవ్వున్నాడు.

—రవణ

> "డబ్బుపోసి నన్ను కొనుక్కునికూడా బల్లకింద దూరాడు
> వెర్రి వెంగళాయి" అనుకుంది రైలు టిక్కెట్టు.
> "అదోముచ్చట కాబోలు"అనుకున్నాడు టిక్కెట్టు కలెక్టరు.